


కొండంత జబ్బులో ఉన్నాడు వాసు. జబ్బును తన తండ్రి సహాయం అపేక్షించకుండానే నయం చేసుకునేందుకు ప్రయత్నించాడు. కాని తప్పక- స్నేహితుల బలవంతం మీద - తండ్రి శేషయ్య దగ్గరకు పోయినాడు.

శేషయ్యకు వాసు మీద మొదటినుంచీ నమ్మకం లేదు. చిన్నప్పటినుంచీ శేషయ్యను వాడు వేధిస్తునే ఉన్నాడు. అయినా తండ్రి కావడం చేత వాణ్ని క్షమిస్తూ వచ్చాడు. ఆయన తనను క్షమించడం ఆయన విధి అని వాసు భావం. తన అల్లరితనానికి కారణం శేషయ్యే నని వాసు అనుకునేవాడు. వాడు చిన్న పిల్లవాడుగా ఎప్పుడూ ఆయనకు కనుపించలేదు. వాసు చేసిన ప్రతి పనీ ఆయన అనుభవాన్నీ నమ్మకాలనూ ప్రశ్నిస్తూనే ఉన్నది. కాబట్టి మొదట్లో ఆయనలో క్షమగా ఉన్న ప్రవృత్తి వాసంటే నిర్లక్ష్యంగానూ ఒక విధమైన ద్వేషంగానూ మారి పోయింది. ఎన్నిసార్లు వాసుని క్షమించి మంచి వాణ్ణి చేద్దామని ప్రయత్నించినా వాడు తన దోవను వదలిపెట్టలేదు. వదలిపెట్టడు. కాబట్టి శేషయ్యంటే మొదట్లో భయమూ తరువాత ద్వేషమూ ప్రబలినాయి.

తను చేసేదే రైటని వాసు ఎప్పుడూ అనుకో లేదు. తనకంటే తెలిసిన వారున్నారని శేషయ్య ఎప్పుడూ అనుకోలేదు. తన వంశం గొప్పది. తన తండ్రి విద్వాంసుడు. త్యాగి. కనుక తను కూడా తప్పక గొప్పవాడేనని ఆయన అహం. పైగా వ్యక్తికి బాగుచేసే టందుకున్న స్వేచ్ఛ పాడుచేయడానికి కూడా ఉన్నదని ఆయన వాదన. కాని ఇటువంటి వాదనలేమీ వాసుకి లేవు. తన తండ్రిని మెప్పించాలనే కోరిక తనకూ ఉన్నది. కాని ఏమిచేస్తే ఆయనకు ఎప్పుడూ మంచివాడవుతాడో మాత్రం వాసుకి తెలియడం లేదు; తెలియదు. సంధ్య వార్చకో కండా అన్నం తిన్నప్పుడు "సంధ్యా గింధ్యా లేకుండా మాలకూడు తింటున్నావ్." అని కూకలేశాడు శేషయ్య. అందుకని వాసు ప్రతి రోజూ మూడుపూటలా సంధ్య వార్చడం సాగిస్తే "ఏమిటోయ్ ఈ ఛాందసం. ఇదేం మనకు తిండి పెట్టుందా యేమిటి" అని ఒక రోజున విసుక్కున్నాడు.

అట్లాగే తనకు పెళ్ళి అంటే చెడ్డకోపం. అందుకని ఇంటిదగ్గర ఉంటే ఎట్లాగో ఆ మూడు ముళ్లూ వేస్తారని ఇల్లు పట్టకుండా అట్లా అట్లా తిరుగుతూంటే "పట్టి రౌడీలా తిరుగుతున్నావ్. నాకు తెలుసులే ఆ యానాది మాణిక్యంతో నీ సంబంధం" అని కేకలు వేశాడు శేషయ్య. పైగా కనుపించిన ప్రతి పెద్దమనిషికీ ఆ సంగతి చెప్పి ఎంతగోల చేయగలడో అంతా చేశాడు. అప్పటికీ వాసు లొంగనప్పుడు "నీ గోల వది లేస్తేగాని మిగతా పిల్లలు బాగుపడరు. అప్పుడే రెండోవాడికి కావాల్సినంత కట్నం ఇస్తామని బోలెడన్ని సంబంధాలు వస్తున్నాయి" అని ఇంకో పంథా సాగించాడు.

వి. యస్. అవధాని

ఇదికూడా వాసుమీద పని చెయ్యలేదు. కాని ఆ రకపు అనుభవంకోసం ఒకరకమైన వెర పెర ఆరంభమయింది. కాబట్టి ఆయన వలలో పడ్డాడు. అప్పటినుంచీ ఇద్దరికీ బొత్తిగా పొత్తు కుదరకపోయింది. వాసు పెళ్ళిలోనే "ఈ గాడిదకు పెళ్ళి ఎందుకు చెయ్యాలి? వీడు నేను చెప్పినట్లు ఉంటాడా? చేస్తాడా?" అని శేషయ్య విసుక్కున్నాడు. ఆదివరకు ఆయనంటే ఉన్న కాస్త భయమూ గౌరవమూ వాడి పెండ్లిలో పూర్తిగా పోయినాయి.

వాసు అందరికి మల్లేనే తన తండ్రిని మొదటినుంచీ గౌరవించాడు. ఆయనపట్ల ద్వేషం వహించాలని ఎన్నడూ అనుకోలేదు. కాని తన శరీరం చెప్పినట్లూ తనకు తోచినట్లూ చేయడం వాణ్ణి ఒకవిధంగా తయారు చేసింది. ఆ తయారు శేషయ్యకు కంటకం అయింది.

ఆయనకూడా అందరు తండ్రులకు మల్లేనే కొడుకును బాగుచెయ్యాలని ప్రయత్నించాడు. వాడిబాగు తనకు తెలిసినట్టు బాధపడ్డాడు. కాని వాడు తన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించడాన్ని నిర్లిప్తంగా మాత్రం చూడలేకపోయినాడు. ఆ మాటకు వస్తే ఏ తండ్రి తన కొడుకు ప్రవర్తనను నిర్లిప్తంగా చూడగలడు? వాడి బాల్యంలో వాడి ప్రవర్తనను (చేష్టలను) నిర్లిప్తంగానే చూశాడు కనుకనే కొట్టినప్పుడు కొట్టినా తిట్టినపుడు తిట్టినా వాణ్ణి మన్నించి ఇంట్లో ఉండనిచ్చాడు.

అట్లా ఇంట్లో ఉండడమే వాసు తన కపకారం అయిందని అంటాడు "నన్ను ఆయన ఇంట్లోంచి వెళ్ళగొట్టితే నా జీవితం ఇంకోవిధంగా ఉండేది. ఆ ఇంటితోపాటు అనేక గుణాలనుకూడా నేను శాశ్వతంగా వదిలివేసేవాణ్ణి" అని అంటాడు.

తన శరీర అవసరాలను తీర్చుకున్నాకనే శేషయ్య కుటుంబం సంగతి ఆలోచించేవాడు. అట్లాగే చేస్తున్న కొడుకును చూస్తే ఆయనకు కిట్టదు. ఆయన లెక్కలో తను కొడుకును పోషిస్తున్నాడు. కనుక తనకొక ఆటవస్తువులాగ వినియోగపడాలి. అట్లాగే వాసు దృష్టిలో తన తండ్రికి తనను కన్నందుకుగాను పోషించాలిసిన బాధ్యత ఉన్నది. అలా పోషించడం తనకోసం కాదు. తనకోసమే అయితే తన కోరికను, ఇష్టాన్ని - మూలంగా తీసుకుని తన తండ్రి వ్యవహరించాలి. అలా జరగడం లేదు. కాబట్టి తన ప్రతిపత్తికి భంగం కాకుండా ఉండగలందులకుగాను శేషయ్య తనకు చేతనయినట్టు తనను పోషిస్తున్నాడు. పైగా అలా తనను పోషించడమే తన వికాసానికి ప్రతిభంగం అయింది—

అయితే శేషయ్యకు వాసు అవసరం- అది ఎటువంటిదయినా సరే- కలిగినప్పుడు వాసు ఎప్పుడూ కాదనలేదు. అదే అతని అభివృద్ధికి నిరోధకమయింది. శేషయ్య చేసే పని సబబయింది కాదని తనకు తోచినప్పుడు భయం లేకుండా ఎదిరించేవాడు. వాదించేవాడు. ఆ వాదనలో ఒక్కొక్కసారి శేషయ్యకు కోపం జాస్తి అయి వాణ్ణి తన్నేవాడు. తన్నినా ఆయన ఒక నిర్ణయానికి వచ్చినాక కిమ్మనకుండా దాన్ని అమలుపరచడానికి తానూ సంసిద్ధుడయ్యేవాడు.

* * *

జబ్బులో ఉన్న వాసును శేషయ్య మొదట ఈసడించుకున్నాడు తరువాత ఇంట్లో వాడికి చాకిరీ చేసేవాళ్ళు లేకపోతే తనే స్వయంగా పరిచర్య చేసేవాడు. అట్లాంటి మనిషి శేషయ్య. ఆయన చేసేది గుమాస్తా ఉద్యోగమే అయినా భావాలు మాత్రం చాలా గొప్పవని ఆయన అనుకునేవాడు.

తెలిసో తెలియకో వాసు శేషయ్యతో ఎప్పుడూ అబద్ధమే చెప్పేవాడు. అట్లా కాకుండా ఒకటి రెండుసార్లు నిజం చెప్పినప్పుడు "ఇట్లాంటి చెడ్డ అలవాట్లు నీకెట్లా అబ్బినాయిరా" అని తన్నేవాడు. అవటం చేత వాసు రేపటి సంగతి ఆలోచించకుండా ఈనాడు నిర్భయంగా తన సుఖానికి అవసరమయినంత వరకూ అబద్ధాలు చెప్పేవాడు. అట్లా తను చెప్పింది నిజమగునా కాదా అన్న మీమాంస వాడికి అసలు లేదు.

తను స్వయంగా వాసుకి పరిచర్య చేసి చేసి మందు కూడా తానే ఇచ్చేవాడు. అంటే తనకు తెలిసిన వైద్యజ్ఞానం వాడి జబ్బును నయం చెయ్యాలని ఆయన పట్టుదల. కాని ఆ జబ్బు అయితే నయం కాలేదు. జ్వరం మాత్రం బయటి

రావడం మానివేసింది. అంతకుముందు వాసులో ఎటువంటి మార్పు రాలేదు. అట్లాంటి రోజులలో ఒకనాడు శేషయ్య ఆఫీసునుంచి వస్తూనే "ఒరే వాసూ! రేపు తొమ్మిదిగంటల బండికి బెజవాడపోయి నీ భార్యను తీసుకు రారా" అన్నాడు

ఆ అమ్మాయి మొహం మాత్రమే వాసు ఎరుగును. ఆ యింట్లో మిగతా వారిని ఎవరినీ తను ఎరగడు. అందుచేత అనుమానం. "అట్లా వాళ్లు పంపిస్తారా?" అన్నాడు వాసు.

"అది తేల్చడానికే నిన్ను అక్కడికిపోయి రమ్మంటున్నాను."

"పోయినసారి కార్యం జరుగలేదు. అట్లా నీ వెంట ఒక్కర్తినీ పంపించడానికి వీలులేదు-అని వాళ్ళంటే?"

"ఆమాట నన్నడుగుతావేమోయ్ దద్దమ్మా, వాళ్ళు నిన్ను చవటకింద లెక్క కట్టారు."

"వాళ్లు నన్ను చవటకింద లెక్క కట్టారా? ఎప్పుడు? ఏధంగా?"

"ఒకసారేమిటి? అనేకసార్లు అనేక రకాలుగా! నా చేత చెప్పించాలా ఏమిటి? నీకు తెలియదూ?"

"ఇప్పుడు వాళ్లు పంపించకపోతే నేను ఇంకా పెద్ద చవట నవుతాను. అలా కావడం..."

"ఈ ఉపన్యాసాలన్నీ కట్టిపెట్టు. మీ అమ్మకి కూడా కాస్త సరదా తీరుతుంది. పో... బండికి టైం అయింది. ఈ రాత్రి బండికే తీసుకురా..." అన్నాడు శేషయ్య.

ఇక ఆ మాటకు తిరుగుండదని వాసుకు తెలుసు. అయినా అంత జబ్బుగా అటువంటి పని అతనికి ఇష్టం లేదు. అయినా ఆ శశితో మాట్లాడాలని తనకూ ఉన్నది. ఆపిల్లకు ఎక్కడా లేని సిగ్గు. పైగా ఆమె తల్లిదండ్రులు కొంచెం వెనకటి కాలానికి చెందినవారు. అటువంటి పిల్లతో తను ఎట్లా వ్యవహరించగలడు? ఒకవేళ బాల్య చాపల్యంచేత ఆ అమ్మాయి తనతో ప్రసంగించడానికి ఇష్టపడినా వాళ్లు పెద్దవాళ్లు ఒంటరిగా ఆమెను తనవెంట రానిస్తారా? పైగా ఆపిల్ల జబ్బుపిల్ల. ఇదంతా యేమిటి? అంత సరదా తీర్చుకోతలుచుకున్నవాడు - శేషయ్య - పోయి ఎందుకు తీసుకురాకూడదు? ఇట్లా నిర్ఘాంతంగా ఆలోచిస్తూ కూర్చున్న వాసును చూసి శేషయ్య "ఇదిగో నాలుగు రూపాయిలు ఇంట్లో లేకపోతే ఎక్కడో అప్పు తెచ్చాను. ఇవాళే పోయి తీసుకురా" అన్నాడు. వాసు ఆలోచించకుండానే బయల్దేరాడు. ఒక చెంప జబ్బు. మరొక చెంప తండ్రిపోరు. ఒకవంక ఒక కొత్త అనుభవంకోసం పెనగులాట. మరొక వంక సంప్రదాయంతో పెనగులాట.

వాసు అడగగానే వాడి వదినగారు పిల్లను వాడివెంట పంపింది. అలా పంపడంలో వాసు నెత్తిన పెద్దరాయి పెట్టినట్లయింది. పోనీ వాళ్లయినా "పిల్లకిదేం రోగం? పంపడానికి వీలు లేదు" అని గట్టిగా నిలబడ్డట్లయితే బాగుండేది. పైగా రైల్లోనే ఆ అమ్మాయికి తలనొప్పి వచ్చింది. పార్శ్వపు తలనొప్పి. దాని వెంబడి హిస్టీరియా. ఇటువంటి పిల్లను తనవెంబడి తీసుకుపోయి కొందరు అపరిచిత వ్యక్తులమధ్య వదిలితే ఏమవుతుంది? పోనీ ఆ వ్యక్తులయినా సామాన్యులా? సంసారం తెలిసినవారు. తమరు తప్పితే ఇతర్లు ఎవరూ నీతివంతులుగా ఉండలేరన్న నమ్మకం గలవారు. అటువంటి వాళ్లమధ్యకు శశివంటి అమాయకపు పిల్లను వదిలి తాను మళ్లీ కాలేజీకి పోవాలి. ఈ పిల్లగతి ఏమవుతుంది? అటువంటి ఆలోచనలతో వాసు శశిని వాళ్లదగ్గిర తీసుకువెళ్లాడు. కాని శేషయ్యలో సరదా ఏమీ కనుపించలేదు. తనకుచాలా సరదాగానే ఉన్నది. ఇంట్లో ఎవరూ ఆ పిల్లను మనిషిగా లెక్క చేయలేదు. బండి దిగి ఆపిల్ల లోపలికి పోయినప్పుడు "బాగున్నావా?" అని ఎవరూ, అడగలేదు. అందరూ కాఫీ తాగి, మీరిద్దరూ కాఫీ తాగారా అనయినా అడగలేదు. పైగా అదోరకంగా, వాసువంకా, శశివంకా పెద్దవాళ్లూ, చిన్నవాళ్లూ చూస్తున్నారు.

ఇదంతా ఇట్లా వుండగా వాసు కాబోయిన జ్వరం ఎక్కువయింది. అంతలో వాళ్లమ్మ ఇరుగమ్మలతోనూ పొరుగమ్మలతోనూ "ఎక్కువకాక ఏమవుతుంది? పగలే గదిలో కావలించుకు పడుకుంటేను" అని వాగుతోంది.

శేషయ్య ఆ అమ్మాయి ఒంటరిగా ఉన్నప్పుడిలా అన్నాడు: "పిల్లకి జబ్బు ఇంకా నయం కాలేదు. పట్నంలో హోటలు భోజనం సరి

పడదు కాబట్టి తన వెంట నిన్ను రమ్మంటాడు. నువ్వు వెళ్ళవద్దు." అదే రోజున వాసుతో ఇలా అన్నాడు: "నీకీజబ్బు నయం కావడానికి ఇంకా నాలుగు నెలలయినా పడుతుంది. మరి అక్కడ ఎట్లా ఉంటావో ఏమిటో?" వాసు ఆయన మాటలు విన్నట్లుగానూ ఏదోరకంగానూ ఆయన వంక చూశాడు. చివరికి వాసు తిరిగి కాలేజీకి వెళ్ళాలిసిన రోజు వచ్చింది. ఆ రాత్రంతా ఎంతగానో ఆలోచించాడు. ఎంత సేపటికీ "నువ్వు సర్దుకో" అనే ధోరణే తప్ప వయసు మళ్లిన తన తండ్రి సర్దుకునే పద్ధతేమీ తోచడంలేదు. ఎవరు కనమన్నారు? కని ఎవర్ని ఉద్ధరిస్తున్నారు? చదువు చెప్పించడానికి గోల. పెళ్ళి చెయ్యడానికి గోల. ఈ గోల ఎట్లా పోతుంది? తను ఆ గోల పోవడానికి ఏమి చెయ్యగలడు? ఏమిచేస్తే తను తన తండ్రికి మంచివాడవుతాడు? ఆయనకు మంచివాడు కావడానికి తనకు ఇష్టంలేని పనులు ఎన్నో చేశాడు. చేస్తున్నాడు. అదే ఈ కల్లోలరంగానికి కారణం. దాన్ని తన తెలివినంతా ఉపయోగించి మార్చాలి. ఆయనకు తనమీద అధికారం చెలాయించగల వీలును శాశ్వతంగా తీసి వెయ్యాలి. అదే ఎట్లా? ఒకవంక తీవ్రమయిన సన్నిపాత జ్వరం. మరొక వంక ఆనంత్యమగు ప్రశ్న పరంపర. రెండూ కాసేపు జోగొట్టి వాసును నిద్ర పుచ్చినాయి. కాని కాసేపు కళ్లు మూశాడో లేదో తన తలను నిమురుతున్న గాజుల సవ్వడి వణ్ని ఈ ప్రపంచంలోకి తీసుకు వచ్చింది.

"నిద్ర చెడగొట్టానా?"

"అంతగా చెడగొట్టలేదు..."

"మీరు రేపు కాలేజీకి వెళ్తారటగా."

"ఏమో. కాలేజీ మాత్రం రేపు తెరుస్తారు. వెళ్ళడం మానడం నా ఇష్టం. నీ కోరిక."

"నా కోరిక..."

"శశీ... నా జీవితం దుర్భరం అవుతోంది. ఇంతవరకూ చదువులో ఈయన దమ్మిడీ సహాయం చేయలేదు. స్కూలుఫైనలు ప్యాసయేదాకా..."

"అలా విసుక్కోకండి..."

"విసుక్కోక చేసేదేమీ కనుపించడం లేదు. మీ వాళ్లు..."

"మావాళ్లు... ఏమిటి?"

"ఏమయినా కొంచెం సహాయం చేస్తారా?"

"ఎటువంటి సహాయం?"

"ఎటువంటి సహాయమో తెలియడం లేదూ..."

"తెలుస్తూనే ఉన్నది. ఈ పెళ్లి ఎవరు చెయ్యమన్నారు? నేను మావాళ్ళకు ఆఖరు పిల్లని అని మీ అందరకూ తెలుసు గదా? ఏ ఒక్క ముచ్చటా లేకుండా ఇలా చేయడం ఏం బాగుందీ?"

"ఆయన తీరే అంత. నన్నేం చెయ్యమంటావ్? తీరు నిన్నే కాదు. నన్నూ బాధపెటుతోంది. కాని ఆయన పెద్దవాడు కనుక సహించాలి అని అంటారు."

"ఈ తీరు చిన్న కొడుకునూ కోడల్నూ చూసినపుడు ఎందుకు మారుతుంది?"

"దానికి చాలా కారణాలున్నాయి. నేను మంచివాణ్ని కాదు. ఒకవేళ ఎవరికయినా మంచి వాణ్నయినా ఆయనకు కాదు. ఆయనకు జబ్బు చేస్తే కిమ్మనకుండా మందు సీసాలు చేరవేయడము, అమ్మ బయట ఉంటే ఇంట్లో పనులన్నీ చేసి (ఆఖరికి పసిపిల్లలకు ఉపచారం చేయడం) ఇవన్నీ కూడా ఆయన దృష్టిలో నాలోని బానిస గుణాల లక్షణం. నేను బానిసగానే ఉండడం ఆయన అభిమతం. చిన్నవాడు అలా కాదు. ఎప్పుడూ ఆయన్ను ప్రశ్నిస్తాడు. వేధిస్తాడు. నాకంటే తెలివిగలవాడు కాబట్టి ఆయనకి నామీద కంటే వాడి మీద మోజు జాస్తీ. మోజే కాదు. కొంచెం భయం కూడా. "నేను జంధ్యాలు తెంచుకు లేచి పోతున్నానని ఆయన అంటే వాడు ఆయన కన్న ముందరగా జంధ్యాలు ఆయన మొహాన పడేసి లేచి పోతాడు. అది నా చేతకాదు..."

"చేతకాదు. అభం శుభం ఎరగని పిల్లను నా వెంటరా అని తీసుకువచ్చి రాక్షస సమానుల మధ్యవదిలి లేచిపోవడం చేతనవును."

"అయితే ఏం చేయమంటావ్?"

"నాకేం తెలుస్తుంది? నేను పార్టీ సభ్యురాలను కాదు. కాలేజీ చదువులు చదవలేదు. మా నాన్నకి కలక్టరాఫీసులో ఉద్యోగం లేదు. మా అన్నయ్యలు చదువుకున్నది చాలా తక్కువ..."



"శశీ... నువ్వూ నన్ను వేధిస్తావా?"

"అవును మీ కష్టం నేను వినాలి. నా స్థితి నేను మీకు చెప్పడం మిమ్మల్ని వేధించడం అవుతుందని మీకే ధర్మం చెప్పిందండీ?"

"శ శీ......"

"కోపించకండి. నన్నూ మీతో తీసుకు వెళ్లండి. మీరు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే ఉంటాను. ఈ పరిస్థితిలో నేను మావాళ్ళదగ్గర కూడా పోను. మా అక్కయ్య మానాన్నతో పోట్లాడి నన్ను మీతో పంపింది. ఈ సారి నేను అక్కడికి వెళితే నా సంగతి ఎలా ఉంటుందో నాకు తెలియదు."

"తొందరపడుతున్నావు. తొందరగా కోపం ఎక్కువవుతోంది. కోపంలో మంచి చెడులు, ఉపాయం ఆలోచించడానికి బదులు మంకుతనం చేస్తున్నావు."

"ఈ మాటలన్నీ మీలాగ కాకపోయినా నాకూ కొంత తెలుసు. ఎవరికి మంచి? ఎవరికి చెడు? పెళ్లయిన నాటినుంచీ జరిగిన నాటకం అంతా తలుచుకుంటే వళ్లు మండుకోస్తోంది. వాళ్లు చేసిన పనులు బాగుంటే సంపాయించిందంతా వారికే పెట్టుకోండి. నన్నుమాత్రం ఒక కుక్కలాగానో, నక్కలాగానో చూస్తే నేను సహించను..."

"సహించను అని అనడం సులభం. సహించక చేసే దేమిటి అంటే ఈ గోడవంతా ఎత్తుకు వస్తావేమిటి?"

"నేను చెప్పినట్లు మీరు చెయ్యలేరు. చెయ్యరు. ఇక్కడికి వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. నా కొక్కర్తెకే తలనొప్పి వచ్చిందా? నే నొక్కర్తెనే ఆడదాన్నయి పుట్టానా? వీళ్లకు మాత్రం ఆడపిల్లలు లేరా? వాళ్ల ఇలాగే చేసుకుంటారా? ఈ గోలంతా దేనికి? నన్ను మీతో తీసుకు వెళ్లండి. అటు వాళ్లకీ కాకుండా ఇటు మీకూ కాకుండా వీళ్లకి నే నేమవుదామని! ప్రయత్నించినా నావల్ల ఏమవుతుంది? వంట్లో ఓపిక లేనిదాన్ని. రోగిష్టిని. అయితే నా ఇల్లు నేను చక్కపెట్టుకో లేనిదాన్నిమాత్రం కాదనుకుంటాను. ప్రతి నిమిషమూ పసిగట్టుంటే సహించడం కష్టం. బ్రతకడం కష్టం."

"కష్టమయినా సుఖమయినా మనం చేసుకున్నదే శశీ! కష్టాన్ని నిర్లిప్తంగా చూడాలి. ఒక నాటకంలోని సన్నివేశంలా చూడాలి."

"అవునవును. అందుకనే నన్ను మీ వెంట తీసుకు వెళ్ళండి. నాటకం చాలా బాగుంటుంది."

"తీసుకు వెళ్ళడానికి నాకేం అభ్యంతరం లేదు. తీరా మనం ఇద్దరం కలిసి ఎక్కడికో పోయినాక ఇంతకన్న బాధలు ఎక్కువయి ఇలా ఎందుకు చేశామా అని అనుకోవాలిసొస్తుందేమో."

"అదంతా నాకు తెలియదు. చివరికి అటువంటివేమీ నేనూహించనైనా ఊహించలేను. ఇలాంటి చర్చ మీకు నన్ను ఇక్కడికి తీసుకు వచ్చేటప్పుడు ఎందుకు తోచలేదూ? ఇంత కూలంకషంగా ప్రతి విషయాన్నీ నాతో కనుక చర్చించ గలుగుతున్నారు. పైగా ప్రతిసారీ ఇంతకన్న ఎక్కువ అపాయం రావచ్చు అని సూచిస్తున్నారు. నేను భయపడను. భయపడవలసిన అవసరం కూడా లేదు. పదండి ఇప్పటికిప్పుడే పోదాం."

"ఈ పాటునే?"

"ఆ... ఈ పాటునే. ఇదిగో నగల రూపాయలు. పదండి. అంధకారంలోనూ, తుపానులోనూ, కరువులోనూ, మన జీవితం ఎలా ఉంటుందో చూదాం. అదేగా మీరు నాటకం అని అంటున్నారు."

"అయితే విను. నేను కాలేజీకిపోయి నిన్ను తరువాత తీసుకు వెళతాను."

"అవేమీ కుదరవు. నే నిక్కడ ఒక్క నిముషంకూడా ఉండను. మా వాళ్ళ ఇంటికిపోను. మరెక్కడనయినా ఉండడానికి నాకేం అభ్యంతరం లేదు. కాని ఇంకెక్కడనయినా నన్ను మీరు ఉంచగలరా?"

"లేదు. ఉంచలేను. పోదాం పద."

ఇద్దరూ బయలుదేరారు. అమావాస్య చీకటి. దొంగ సమయం. ఆకాశంలో మేఘాలు వీర విహారం చేయసాగినాయి. నేనూ ఉన్నానంటూ పెద్దగాలి ఆరంభమయింది. వారు చూపిన రూపాయికి ఆశపడి బల్లకట్టు తోలేవాడు నిద్ర లేచి బల్లకట్టు ఊడ తీశాడు. అంతవరకే వాని శక్తి పని చేసింది. తరువాత వచ్చిన విజృంభణకు వాడు తట్టుకోలేక పోయాడు. బల్లకట్టు తలక్రిందయింది.

మర్నాటి ఉదయం శేషయ్యగారింటికి మైలు జవాను పరుగెత్తుకువచ్చి పుత్రుని శాశ్వత రాజీనామాను తెలియచేశాడు. కలవరం లేని దిగులుతో, మలినమగు దుఃఖంతో శేషయ్య పరిగెత్తినట్లుగా నడిచి పోయాడు.


# తెలుగు స్వతంత్ర

సాలుచందా ... రూ 12—0—0   అర్థ సం॥ చందా ... రూ 6—0—0

—( విడి ప్రతి నాల్గణాలు )—

అర్థ సంవత్సరముకంటె తక్కువ కాలమునకు చందా అంగీకరించబడదు.

—o ప్రకటన రేట్లు o—

పూర్తి పేజీ ... రూ 80—0—0   అర పేజీ ... రూ 45—0—0

పావు పేజీ ... రూ 25—0—0

సాలుకు 24 లేక అంతకుమించిన పర్యాయములు ప్రకటించువారికి కంట్రాక్టుల రేట్లు అనుసరిస్తవి.

పూర్తి పేజీ తేపకు రూ. 60—0—0,   అర పేజీ తేపకు రూ. 35—0—0

పావు పేజీ తేపకు ... రూ 20—0—0

మిగతా వివరములకు వ్రాయండి: తెలుగు స్వతంత్ర

160, లాయిడ్స్ రోడ్డు, రాయపేట—మద్రాసు-14.